సాక్షి
తిరుపతి
శుక్రవారం ౹ 16 ౹ ఆగస్టు ౹ 2024



కంటికి రెప్పలా కాపాడుకుంటా

పార్టీ కేడర్‌ని కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. - 8లో



అపాచి ముందు భారీ లక్ష్యాలు

అపాచి బూట్ల పరిశ్రమ భారీ లక్ష్యాలతో ముందుకు సాగుతోందని జీఎం ముత్తు గోవింద స్వామి తెలిపారు. - 8లో



సోలార్ విద్యుత్‌కు ప్రోత్సాహం

దేశ వ్యాప్తంగా సోలార్ విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఎస్పీడీఎస్‌ఎల్ సీఎండీ సంతోషరావు స్పష్టం చేశారు. - 8లో

ప్రగతి పథం.. త్రివర్ణ శోభితం



తిరుపతి పోలీస్ పరేడ్‌లో జెండా వందనం సమర్పిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

తిరుపతి జిల్లా వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్ని మిన్నంటించారు. గురువారం ఊరూ..వాడా తేడాలేకుండా జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల స్మృతులను నెమరువేసుకున్నారు. వారి అడుగు జాడల్లో నడవాలని యువతకు పిలుపునిచ్చారు. తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డితోపాటు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

- జిల్లాలో ఉప్పొంగిన దేశభక్తి
- ఘనంగా స్వాతంత్ర్య దిన వేడుకలు
- తిరుపతి పోలీస్ పరేడ్‌లో జిల్లా కార్యక్రమం
- జెండా ఎగురవేసిన మంత్రి ఆనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- జిల్లాలో 392 మందికి ప్రశంసా పత్రాలు

ప్రగతి పథంలో నడిపిద్దాం



మంత్రికి మెమెంటో అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్/ తిరుపతి క్రైమ్: జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దామని రాష్ట్ర దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆయన జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. అంతకుముందు మంత్రి సంప్రదాయం ప్రకారం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత జిల్లా ప్రగతిని చదివి వినిపించారు. ప్రభుత్వ అభివృద్ధి శకటాల ప్రదర్శన చేపట్టగా.. ఇందులో పరిశ్రమలు, వ్యవసాయ, విద్య, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పర్యాటక, జిల్లా వైద్యఆరోగ్య, పోలీస్‌శాఖలతోపాటు, తిరుపతి నగరపాలక సంస్థ, ఫాల్కన్ వాహనాల ప్రదర్శన ఆకట్టుకుంది. పోలీసు జాగిలాల ప్రదర్శన సభికులను మంత్రముగ్ధులను చేసింది. ప్రతిభ కనబరిచిన 392 మంది జిల్లా అధికారులు, ఉద్యోగులు, పోలీసులకు ప్రశంసా పత్రాలు, పోలీస్ మెడల్స్‌ను అందించారు. ప్రభుత్వ శాఖల వారు ఏర్పాటు చేసిన 11 స్టాల్స్‌ను, మంత్రితోపాటు అధికారులు సందర్శించారు. వ్యాఖ్యాతగా వ్యవహరించిన కృష్ణవేణి, షాజహాన్‌కు కలెక్టర్ ప్రశంసా పత్రాన్ని అందించారు. ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తినాని, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్యప్రదర్శనలు

కూటమి నేతలే వీఐపీలు

వీవీఐపీల కోసం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రదేశంలో అంతా కూటమి నేతలే కూర్చున్నారు. అయితే వారిని ప్రశ్నించలేక వీవీఐపీలు మొదటి వరుసను వదిలిపెట్టి రెండు, మూడు వరుసల్లోకెళ్లి కూర్చోవాల్సి వచ్చింది. మరోవైపు వేదికపై ఉక్కపోతలో మూడు గంటలకు పైగా కూర్చోవడానికి మంత్రి ఆనం రామ్‌నారాయణరెడ్డి నానా ఇక్కట్లు పడ్డారు.



వీవీఐపీ ప్రదేశంలో కూర్చున్న టీడీపీ కూటమి నేతలు



జాగిలం.. విన్యాసం



జెండా వందనం చేస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

శాంతి భద్రతలకు విఘాతం

- మాపై పనికట్టుకుని కొన్ని పత్రికలు, చానళ్లు తప్పుడు ప్రచారం
- అలాంటి వారిపై పరువు నష్టం దావా వేస్తాం
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి ధ్వజం

తిరుపతి మంగళం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడిందని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి మారుతీనగర్‌లోని తన క్యాంప్ కార్యాలయం వద్ద 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. అనంతరం దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించిన ఎందరో త్యాగమూర్తులను స్మరించుకుని, ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధి కోసం వారి అడుగుజాడల్లో పయనించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం ఇస్తే వారు మాత్రం రెడ్‌బుక్ పాలన సాగిస్తూ శాంతి భద్రతలను మంటగలుపుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తమ కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. నోటికొచ్చిన అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. తమపై చూపుతున్న శ్రద్ధ ప్రజలకు ఇచ్చిన హామీలపై చూపితే మంచిదన్నారు. అలా కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇకపై పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యం అందే పరిస్థితి లేదన్నారు. రెండు నెలల్లో ఆరోగ్య శ్రీకి రూ.2,500 కోట్లు ప్రభుత్వం బకాయి పడిందన్నారు. దీన్ని బట్టి త్వరలోనే ఆరోగ్యశ్రీని చంద్రబాబు నిర్వీర్యం చేసే అవకాశం ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రభుత్వాస్పత్రుల్లో పేదలు ఫీజులు చెల్లించి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తుందేమోనన్నారు.

పరువు నష్టం దావా వేస్తాం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తామే టార్గెట్‌గా చంద్రబాబు, లోకేష్ పెట్టుకున్నారని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తమపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్న కొన్ని పత్రికలు, చానళ్లపై పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం చేసిన, చేస్తున్న తప్పులను దాచేసి తమ కుటుంబంపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. త్వరలోనే కోర్టు ద్వారా ఎల్లో మీడియాకు తగిన గుణపాఠం చెబుతామన్నారు.

న్యూస్‌రీల్

ఉపరాష్ట్రపతి పర్యటనకు పటిష్ట భద్రత



భారత ఉప రాష్ట్రపతి పర్యటనపై సమావేశమైన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈనెల 17వ తేదీన జిల్లా పర్యటన సందర్భంగా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని, చిన్న లోటుపాట్లు కూడా చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. రేణిగుంట విమానాశ్రయంలో గురువారం ఆయన అధికారులతో ఈఎస్‌ఎల్ సమావేశం నిర్వహించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో ఈనెల 17వ తేదీన జరగనున్న స్వర్ణభారతి ట్రస్ట్ 23వ వార్షికోత్సవానికి ఆయన సతీ సమేతంగా హాజరు కానున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 72,967 మంది స్వామివారిని దర్శించుకోగా 32,421 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.26 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం పూర్తవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని వెల్లడించింది.

ఆకట్టుకున్న కోర్టు స్టాంపుల ప్రదర్శన



కోర్టు స్టాంపులను పరిశీలిస్తున్న జడ్జి గురునాథ్

తిరుపతి లీగల్ : తిరుపతి న్యాయవాది వై.వెంకటేశ్వరరావు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతిలో ఏర్పాటు చేసిన కోర్టు స్టాంపుల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. తిరుపతి కోర్టు ఆవరణలోని గ్రంథాలయంలో న్యాయవాది వెంకటేశ్వరరావు న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్, ఇతర న్యాయమూర్తులు స్టాంపుల ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. స్వాతంత్ర్యం రాక మునుపు, తర్వాత కోర్టుల్లో ఉపయోగించిన వివిధ స్టాంపులను న్యాయవాది వెంకటేశ్వరరావు సేకరించినట్లు మీడియాకు తెలిపారు.

వారి త్యాగాలు మరువొద్దు



గౌరవ వందనం స్వీకరిస్తున్న శ్రీసిటీసెజ్ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలో స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక బిజినెస్ సెంటర్ ప్రాంగణం వద్ద జరిగిన కార్యక్రమంలో శ్రీసిటీ సెజ్ అసిస్టెంట్ డెవలప్మెంట్ కమిషనర్ సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ మన దేశాన్ని అత్యుత్తమ దేశంగా స్వేచ్ఛ, శాంతి, ఐక్యతతో సంతోషంగా జీవించేందుకు అనువైన మంచి ప్రదేశంగా మార్చడానికి మనమంతా కంకణ బద్ధులు కావాలని కోరారు. అనంతరం తమ విధుల్లో విశేష సేవలందించిన శ్రీసిటీలోని సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్, ల్యాండ్‌స్కేపింగ్ విభాగాల సిబ్బందికి, పోలీసులు 38 మందికి అవార్డులు అందజేశారు. గొల్లపాళెం, ఆరూరు, అప్పయ్యపాళెం గ్రామాలకు చెంది యువతీయువకులు, మహిళలు కర్రసాము, భరతనాట్యం, కోలాటం ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

సంతృప్తికరంగా శ్రీవారి దర్శనం

- స్వాతంత్ర్య దినోత్సవంలో టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుపతి(అలిపిరి): భక్తులకు మరింత త్వరగా.. సంతృప్తికరంగా శ్రీవారి దర్శనం కల్పించేందుకు టీటీడీ ఉద్యోగులు అంకితభావంతో సేవలందించాలని ఈఓ జె.శ్యామలరావు పిలుపునిచ్చారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఈఓ జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో యోధుల పోరాటాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ తెలిపారు. సామాన్య భక్తులకు దర్శన సమయాన్ని పెంచేందుకుగాను జూలై 22 నుంచి ఆఫ్‌లైన్‌లో రోజుకు 1000 శ్రీవాణి దర్శనం టికెట్లను మాత్రమే జారీచేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

ప్రస్తుతం 1.59 లక్షల ఎస్‌ఎస్‌డీ టోకెన్లు

గతంలో వారం 1.05 లక్షలు ఇస్తున్న ఎస్‌ఎస్‌డీ టోకెన్లను, ప్రస్తుతం 1.59 లక్షలు ఇస్తున్నట్టు ఈవో తెలిపారు. జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డీఎల్ఓ వరప్రసాద్‌రావు, ఎఫ్ఎ అండ్ సీవో బాలాజీ పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు, జేఈఓలు, సీవీఎస్వో

మహానుభావుల త్యాగ ఫలమే!



జెండా ఎగుర వేస్తున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు: ఎందరో మహానుభావుల ప్రాణత్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం అని ఐసర్, ఐఐటీ డైరెక్టర్లు శాంతనభట్టాచార్య, కేఎన్‌సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఐసర్, ఐఐటీ ప్రాంగణాల్లో 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా డైరెక్టర్లు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఐఐటీలో ఈ ఏడాది 1 నుంచి 5వ తరగతి వరకు ప్రారంభించిన కేవీఐఐటీ విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను విశదీకరించారు. కార్యక్రమంలో కేవీఐఐటీ ప్రిన్సిపల్ బాలకృష్ణారావు, చమన్‌మెహతా, ప్రసన్న సంపత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● భక్త జనసంద్రం



తిరుపతిలో గురువారం పండగ సందడి నెలకొంది. శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. గాంధీరోడ్డు కిక్కిరిసిపోయింది.

– సాక్షి, తిరుపతి ఫొటోగ్రాఫర్



అమ్మా..ఆశీర్వదించు!



చెంగాళమ్మ పరమేశ్వరి సేవలో ఇస్రో చైర్మన్

సూళ్లూరుపేట: ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ గురువారం సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. తాము చేపట్టే ప్రయోగానికి ముందు ప్రతి సారీ అమ్మవారిని దర్శించుకోవడం అనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఎస్ఎస్ఎల్వీ డీ3 ప్రయోగం ఉండడంతో ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రయోగం విజయవంతం కావాలని మొక్కుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ ఇన్‌చార్జి ఈఓ ఆయనకు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయోగానికి సంబంధించి కౌంట్‌డౌన్ ప్రక్రియను శుక్రవారం వేకువ జామున ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఉదయం 9.17 గంటలకు ప్రయోగాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

నవంబర్‌లో 'గగన్‌యాన్'

ఈ ఏడాది నవంబర్‌లో గగన్‌యాన్ ప్రయోగాత్మక ప్రయోగానికి సిద్ధమవుతున్నట్టు ఇస్రో చైర్మన్ తెలిపారు. గురువారం షార్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నవంబర్‌లో గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి మరో ప్రయోగాత్మక ప్రయోగాన్ని చేసిన అనంతరం పూర్తిస్థాయి ప్రయోగానికి సిద్ధమవుతామన్నారు. పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా ప్రోబ్ అనే శాటిలైట్ ప్రయోగాన్ని కూడా నిర్వహించనున్నట్టు తెలిపారు. జీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా నాసాకు చెందిన నిసార్ అనే ఉపగ్రహ ప్రయోగం వాయిదా పడిందన్నారు.



ప్రసంగిస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

తిరుపతి రూరల్: స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు సీజ్ చేశారు. సెబ్ ఎస్ఐ భాగ్యలక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో గురువారం రూరల్ మండలంలో తనిఖీలు చేపట్టినట్టు వెల్లడించారు. పద్మావతిపురం మ్యాంగో మార్కెట్ వద్ద ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించినట్టు తెలిపారు. విచారణలో తనపల్లిలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ కన్నయ్యపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ తమీమ్‌అహ్మద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి


కలగుంట బ్రిడ్జిపై మృతి చెందిన చుక్కల జింక

దొరవారిసత్రం: కలగుంట గ్రామ సమీపంలోని ఫ్లెఓవర్ బ్రిడ్జిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని చుక్కల జింక గురువారం మృతి చెందింది. రోడ్డు దాటుతున్న క్రమంలో సూళ్లూరుపేట వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్లే గుర్తుతెలియన వాహనం జింకను ఢీకొనడంతో అది అక్కడికక్కడే మృతిచెందింది. ఫారెస్ట్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని జింకకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అక్కడే ఖననం చేశారు.

మోటారు బైక్‌ను ఢీకొన్న కారు

– వ్యక్తికి గాయాలు


గాయపడిన హెల్త్ సూపర్‌వైజర్ రియాజ్

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో పెన్నేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గురువారం మోటారు బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌డీ రియాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం.. చెంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రియాజ్ స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు ముగించుకొని మోటారు బైక్‌లో తిరిగి నాయుడుపేటకు వెళుతున్నాడు. మార్గ మధ్యలో పెన్నేపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రియాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

సేవకు సత్కారం

తిరుపతి జిల్లాను ప్రగతి పథంలో నడుపుతున్న వివిధ విభాగాలకు చెందిన అధికారులు, పోలీసులు, సిబ్బందికి గుర్తింపు లభించింది. గురువారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన 392 మంది అధికారులకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు. – తిరుపతి అర్బన్/తిరుపతి క్రైం


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ శ్రీహరి, డీఎంహెచ్ఓ | నారపురెడ్డి మౌర్య, కమిషనర్ | పెంచలకిషోర్, డీఆర్వో | వి.శేఖర్, డీఈఓ | ప్రభావతి, డీఆర్‌డీఏ పీడీ | విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ | చెంగల్‌రెడ్డి, ఆర్టీసీ డీపీటీఓ


కోదండరామిరెడ్డి, ఎస్‌డీసీ | ప్రసాద్‌రావు, అగ్రికల్చర్ జేడీ | నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ | రవిశంకర్‌రెడ్డి, ఆర్డీఓ | రామ్మోహన్, ఎస్‌డీసీ | చంద్రశేఖర్‌నాయుడు, ఎస్‌డీసీ | జయరాజ్, సర్వే జిల్లా అధికారి | రాజారఘువీర్, డీఎస్ఓ | సుశీలాదేవి, డీపీఓ | సతీష్, మైక్రో ఇరిగేషన్


గీతారాణి సెరికల్చర్ అధికారి | శ్రీలక్ష్మి, సహకార సంఘం జిల్లా అధికారి | నాగరాజు, మత్స్యశాఖ జిల్లా అధికారి | చెన్నయ్య, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి | జానకీరామ్, ఎక్సైజ్ జిల్లా అధికారి | మురళీకృష్ణ, సెట్విన్ సీఈఓ | బాలకొండయ్య, డీపీఆర్ఓ | రమేష్‌బాబు, కమిషనర్, శ్రీకాళహస్తి | రవికుమార్, పశుసంవర్ధక జిల్లా అధికారి | రమణయ్య, అగ్నిమాపక జిల్లా అధికారి | రమణప్రసాద్, టూరిజం అధికారి | సయ్యద్–జిల్లా క్రీడా అధికారి | భాస్కర్–జిల్లా వనరుల అధికారి


శశికళ, కలెక్టరేట్ వ్యవసాయశాఖ, ఏఓ | హరికృష్ణ, రుయా ఆస్పత్రి ఆర్ఎంఓ | కృష్ణవేణి, మెప్మా అధికారి | రవి, సమాచారశాఖ ఫొటో గ్రాఫర్ | ఖాదర్‌వల్లి, శిల్పారామం, ఏఓ | జయప్రసాద్, ఏఆర్ఎస్ఐ | సురేష్‌బాబు, ఏఎస్ఐ | గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐ | ధనంజయులు, ఏఆర్‌హెచ్‌సీ | పిఎల్ కార్తీక్, పీసీ | మునిరామయ్య, పీసీ | రెడ్డిమోహన్, ఏఆర్ పీసీ


వెంకటేశ్వరరాజు, హెచ్‌సీ | దామోదరం, పీసీ | రామకృష్ణ, ఏఎస్ఐ | చెంగల్‌రెడ్డి, హెచ్‌సీ | గోపీకృష్ణ, హెచ్‌సీ | షేక్‌అబ్దుల్ రహీం, హెచ్‌సీ | చంద్రశేఖర్, ఏఆర్ పీసీ | ఆర్వైఎం ఆశ, డబ్ల్యూ పీసీ | శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ | ప్రశంసా పత్రం అందుకుంటున్న ప్రసాద్ రాజు, ఏఎస్ఐ

డిల్లీ వేడుకల్లో సత్యవేడు విద్యార్థులు

వరదయ్యపాళెం: దేశ రాజధాని డిల్లీలోని ఎర్రకోటలో జరిగిన 78 స్వాతంత్య్ర వేడుకలకు వరదయ్యపాళెం మండల సంతవేలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఝాన్సీ, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ గురుకులం పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి యువకిరణ్ నాయక్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. వీరి వెంట తెలుగు ఉపాధ్యాయురాలు లత పాల్గొన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో ప్రధానమంత్రి సంగ్రాలయ, ఇండియా గేట్, నేషనల్ మెమొ, రాజ్‌ఘాట్‌లను సందర్శించే ఏర్పాటు చేశారు. అలాగే గురువారం సాయంత్రం నాలుగు నుంచి 6 గంగల మధ్య కేంద్ర విద్యాశాఖమంత్రి వీరితో ముచ్చటించారు. జూన్ నెలలో జరిగిన ప్రేరణ కార్యక్రమంలో పాల్గొన్న ఇద్దరు విద్యార్థులు గెలుపొంది తిరుపతి జిల్లా తరఫున గుజరాత్ రాష్ట్రంలోని వాద్‌నగర్‌లో జరిగిన 10 రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. అందుకే డిల్లీలో జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు వీరికి ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం కల్పించినట్లు టీచర్ లత తెలిపారు.


డిల్లీలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సోలార్ విద్యుత్‌కు ప్రోత్సాహం

- నష్టాలను తగ్గించేందుకు చర్యలు
- వినియోగదారుల సేవలకోసం వాట్సాప్, చాట్‌బోట్ సేవలు
- స్వాతంత్య్ర దినోత్సవంలో సీఎండీ సంతోష రావు వెల్లడి

తిరుపతి రూరల్: ఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని ఆ సంస్థ సీఎండీ సంతోషరావు పేర్కొన్నారు. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో గురువారం స్వాతంత్య్రదినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్య్రం కోసం అసువులు బాసిన మహనీయుల అడుగుజాడల్లో నడుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా సంస్థ పరిధిలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద ఇప్పటివరకు 7,655 మంది వినియోగదారులు దరఖాస్తు చేసుకోగా, వాటిలో 7,458 సర్వీసులకు అనుమతి లభించిందన్నారు. అందులో 58 సర్వీసులకు సంబంధించిన పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. తద్వారా 214 కిలోవాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తవుతుందన్నారు. సంస్థ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలపై కూడా రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు టోల్–ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం, 91333 31912 ద్వారా వాట్సాప్ చాట్, చాట్బోట్ సేవల ద్వారా విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో విజేతలకు జ్ఞాపికలను ప్రదానం చేశారు. సంస్థ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసపత్రాలను అందించారు. చీఫ్ జనరల్ మేనేజరు రమణా దేవి, వరకుమార్, జానకిరామ్, పద్మ, శోభావాలెంటీనా, ఆదిశేషయ్య, ధర్మజ్ఞాని, సీజీఆర్ఎఫ్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ లావణ్యలక్ష్మి పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న అంజనప్ప


శ్రీధర్


తోట మధుసూధన్, పీఆర్వో

ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన మురుగేష్

నాయుడుపేట టౌన్ : మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గూడూరు రూరల్ మండలం, పాలిచర్లరాజుపాళెం గ్రామానికి చెందిన బండి మురుగేష్ సమీప బంధువైన వెంకటేశ్వర్లుకు చెందిన ఐచర్ లారీలో చెన్నై నుంచి గూడూరు వైపు వెళుతున్నారు. మురుగేష్ ఐచర్ లారీ డోరు పక్కనే అతని చెయి పెట్టుకుని కూర్చుని ఉన్నాడు. లారీ పండ్లూరు గ్రామ సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న మరో లారీ వేగంగా వచ్చి ఐషర్ లారీ డోరు పక్కగా వచ్చి ఢీకొంది. దీంతో మురుగేష్ ఎడమ భుజాని తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చేయి చాల వరకు తెగిపోవడంతో అతనిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారు. అయితే ఐషర్ లారీని ఢీకొన్న మరో లారీ అక్కడ నిలప కుండా వెళ్లిపోవడంతో దాని ఆచూకీ తెలియ రాలేదు. ఈ విషయమై బాధితులు రాత్రి వరకు కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ గోపి తెలిపారు.

రెండు ఇసుక లారీల సీజ్

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం జ్ఞానమ్మ కండ్రిగ వద్ద ఇసుక డంపు నుంచి అక్రమ రవాణాకు సిద్ధం చేసిన రెండు ఇసుక లారీలను గురువారం సెబ్ అధికారులు సీజ్ చేశారు. విరూపాక్షపురం స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా తరలించి జ్ఞానమ్మకండ్రిగకు చెందిన టీడీపీ నాయకుడు ఇటుకబట్టిలో డంప్ చేసి, రాత్రివేళల్లో అక్రమంగా లారీల్లో తమిళనాడుకు తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై సాక్షిదినపత్రికలో వచ్చిన కథనాలతో సెబ్ అధికారులు నిఘా పెట్టి టీడీపీ నాయకులు గుట్టు బయటపెట్టారు. లారీలను టూ టౌన్ పోలీసులకు అప్పగించారు. టూ టౌన్ సీఐ రారాజుని వివరణ కోరగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తమిళనాడుకు తరలించేందుకు సిద్ధం చేసిన లారీలను గుర్తించి ఇసుకతో సహా సెబ్ అధికారులు సీజ్ చేసి, తమకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో తడకు చెందిన లారీ డ్రైవర్లు రాజేష్, దినేష్‌ల పైన, లారీలోకి ఇసుక నింపుతున్న జేసీబీ యజమాని, టీడీపీ నేత వేంకటేశ్వర యాదవ్ పైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



బీసీ హాస్టళ్ల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐడీఎస్ఓ ప్రతినిధులు, విద్యార్థులు

తిరుపతి కల్చరల్: కోల్‌కత్తాలో మెడికల్ విద్యార్థిని అత్యాచారం చేసి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐడీఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాహుల్ డిమాండ్ చేశారు. ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో మెడికల్ విద్యార్థిపై జరిగిన అత్యాచార, హత్య ఘటనలకు వ్యతిరేకంగా గురువారం అన్నమయ్య సర్కిల్ సమీపంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత పాశవికంగా అమానవీయంగా మెడికల్ విద్యార్థిని అత్యాచారం చేసి చంపిన నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వాలు, పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. ఈరోజు వస్తున్న అశ్లీల సినిమాలు, పోర్నోగ్రఫీ వెబ్‌సైట్లు, మద్యం, డ్రగ్స్ కారణమని తెలిపారు. కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ నేతలు నవీన్‌కుమార్, జి.ఉన్నతిసింగ్, తేజశ్రీ, అజయ్, మహేష్, తులసి, కృష్ణ, ధీరజ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్వాతంత్య్రం వచ్చినా ఆగని అత్యాచారాలు

తిరుపతి తుడా : స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు గడిచినా మహిళలపై అత్యాచారాలు ఆగకపోవడం దారుణమని జూనియర్ డాక్టర్లు మండిపడ్డారు. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ గురువారం స్విమ్స్ ఆస్పత్రి వద్ద జూనియర్ డాక్టర్లు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. దుర్మార్గుడి కామానికి బలైన డాక్టర్‌కు కేంద్రం న్యాయం చేయాలని డిమాండు చేశారు. నిష్పక్షపాతంగా సీబీఐ విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా వైద్యులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలన్నారు.

కష్టంలో కలసి ఉంటా.. కంటికి రెప్పలా కాపాడుకుంటా!


చంద్రగిరి: సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ముఖ్య నేతలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది
- మనం కూడా పోరాటాలకు సిద్ధమవుదాం
- తేనీటి విందు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్: 'ప్రతి కార్యకర్త, నాయకుడికి అండగా ఉంటా. ఏ కష్టం వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటా' అని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలకు తిరుపతి రూరల్ సీమల్లవరంలో తేనీటి విందును ఏర్పాటు చేశారు. కార్యకర్తలు, అభిమానులు, నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఎక్కడా అరాచకాలు జరగలేదని, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నేతలు సంతోషంగా జీవించారన్నారు. అయితే తాజాగా అధికార పార్టీ నాయకులు, నేతలు గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, ఇప్పుడు జరిగే దాడులకు భవిష్యత్‌లో సమాధానం ఇస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వంపై రెండు నెలలకే ప్రజల నుంచి వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మనం ఎవ్వరికీ కీడు చేయలేదని, పార్టీలు చూడలేదని గుర్తుచేశారు. మనం చెడు చేసి ఓడిపోలేదని, ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం, సేవా కార్యక్రమాలు అందించి ఓడిపోయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు నెలల్లోనే ప్రజలు ఇది గుర్తించారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తి స్థాయిలో మద్దతుగా నిలుస్తారని చెప్పారు. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో తాను అండగా ఉంటానన్నారు.

పసందైన విందు

చెవిరెడ్డి తేనీటి విందుకు హాజరైన ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు అందరికీ 15 రకాల శాఖాహార వంట కాలతో అల్పాహారం ఏర్పాటు చేశారు. తేనీటి విందుకు వచ్చిన అతిథులు అందరికీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి స్వయంగా వడ్డించారు.

జిల్లాలో సీఐల బదిలీ

- ఏడుగురికి నో పోస్టింగ్

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమోషీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే వెలువడ్డ మూడు బదిలీల ఉత్తర్వుల్లో 13 మంది సీఐలకు పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం.. తాజాగా మరో ఏడుగురికి పోస్టింగ్ ఇవ్వకుండా వేకెంట్ రిజర్వు (వీఆర్)కు పంపుతూ ఆదేశాలు జారీ చేసింది. పలమనేరు అర్బన్‌లో పనిచేస్తున్న సి.చంద్రశేఖర్, నగరి రూరల్‌లో ఉన్న పి.సుబ్బిరామిరెడ్డి, పలమనేరు రూరల్‌లో ఉన్న ఇ.కృష్ణమోహన్‌లను చిత్తూరు వీఆర్‌కు పంపించారు. శ్రీకాళహస్తి రూరల్‌లో ఉన్న కె.అజయ్ కుమార్, తిరుమల ట్రాఫిక్‌లో ఉన్న పి.శ్రీరాములు, అలిపిరిలో ఉన్న ఎం.రామారావు, తిరుపతి ఎంఆర్.పల్లెలో ఉన్న తమీమ్ అహ్మద్‌లను తిరుపతి వీఆర్‌కు కేటాయించారు. ఇక ఆదోనిలో పనిచేస్తున్న పి.నరసింహరాజును పలమనేరు అర్బన్‌కు, శ్రీసిటీలో ఉన్న పి.భాస్కర్‌ను నగరి రూరల్‌కు, పత్తికొండలో ఉన్న కె.మురళీమోహన్‌ను పలమనేరు రూరల్‌కు, తిరుపతి సీఐడీలో ఉన్న ఎం.రవినాయక్‌ను శ్రీకాళహస్తి రూరల్‌కు, తిరుపతి వీఆర్‌లో ఉన్న ఎం.ఈశ్వర్‌ను తిరుపతి పీసీఆర్‌కు, తిరుపతి ఇంటెలిజెన్స్‌లో ఉన్న సి.హరిప్రసాద్‌ను తిరుమల ట్రాఫిక్‌కు, కడప తాలూకలో ఉన్న ఎం.తిమ్మయ్యను బీఎన్.కండ్రిగకు, తిరుపతి ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగంలో ఉన్న జి.శ్రీనివాసులును పుంగనూరు అర్బన్‌కు, తిరుపతి సీఐడీలో ఉన్న పీఎస్‌వి.రామకిషోర్‌ను అలిపిరికి, అన్నమయ్య ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగంలో ఉన్న సాధిక్ అలీను తిరుపతి ఎంఆర్.పల్లె, అనంతపురం మహిళా స్టేషన్‌లో ఉన్న ఎ.సంజీవకుమార్‌ను తిరుపతి ట్రాఫిక్‌కు బదిలీ చేస్తు ఆదేశాలు వెలువడ్డాయి.

అపాచి ముందు భారీ లక్ష్యాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం గోవిందస్వామి

తడ: అపాచి బూట్ల పరిశ్రమ భారీ లక్ష్యాలతో ముందుకు సాగుతోందని జీఎం ముత్తు గోవిందస్వామి తెలిపారు. ఆయన గురువారం వీజీఎం గెవిన్ ఛాంగ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమ స్థాపించి 18 ఏళ్లు పూర్తయినట్టు వెల్లడించారు. ప్రస్తుతం ప్రత్యక్షంగా 15 వేల మందికి, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు తెలిపారు. కరోనాతోపాటు అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల వల్ల పరిశ్రమకు తగిన ఆర్డర్లు లేకపోవడంతో కొంత ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం ఆర్డర్లు అనూహ్యంగా పెరిగాయని పేర్కొన్నారు. ఇక్కడ తయారయ్యే బూట్లను అడిడాస్ ద్వారా ఇండియాలో విక్రయించేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అపాచికి అనుబంధంగా ఉన్న మ్యాక్స్‌కింగ్‌లో కొత్త డిజైన్లు తయారు చేస్తున్నట్టు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో వంద మిలియన్ల పెట్టుబడితో శ్రీకాళహస్తి, కడప, వెంకటగిరి, గూడూరు ప్రాంతాల్లో పరిశ్రమ అనుబంధ కేంద్రాలను అందుబాటులోకి తెస్తామని వివరించారు. వాటి ద్వారా 2 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి, 30 వేల మంది ఉద్యోగులతో పరిశ్రమను నిలపాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. పరిశ్రమ ఉద్యోగుల్లో 57 శాతం మంది మహిళలు ఉన్నారని, వారిలో నైపుణ్యం పెంచి మహిళలకే కీలక బాధ్యతలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు.